క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లెరూరల్: రేపల్లె 132/33 కేవీ సబ్ స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 17వతేదీ మంగళవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు రేపల్లె పట్టణ, మండలంలోని అన్ని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఆ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.సురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

శక్తి వనరులపై సదస్సు

రేపల్లె రూరల్: జాతీయ శక్తి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు శక్తివనరుల పరిరక్షణపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ.కోటేశ్వరరావు విద్యార్థులకు శక్తి వనరుల సంరక్షణ, వాతావరణ కాలుష్యం తగ్గింపు, ఆర్థికవృద్ధికి దోహదం చేయటం, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలను వివరించారు. అధ్యాపకులు డి.సంపూర్ణరావు, షేక్ సత్తార్, ఎం.నరసయ్య, కె.భాస్కరరావు, వీవీ రవీంద్ర, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య భారతిపై అవగాహన



భట్టిప్రోలు: భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్(బీఎఫ్ఏ) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక విశ్వశాంతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఆరోగ్య భారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.విష్ణు ప్రసాద్, డాక్టర్ వి.శేషగిరిరావు, ఎం.వెంకటేశ్వర్లులు విద్యార్థులకు ఆరోగ్యకరమైన అలవాట్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం ఆరోగ్యంగా ఉంటేనే.. దేశం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రథమ చికిత్సలో భాగంగా ఎవరైనా ఓ వ్యక్తి స్పృహ కోల్పోయినప్పుడు అందరూ గుమి కూడటం చేయకూడదని.. వారికి గాలి తగిలే విధంగా చూడాలని సూచించారు. వ్యక్తికి ప్రాణాపాయ సమయంలో 10 నిమిషాలలోపు సీపీఆర్‌ను చేసిన ఎడల రక్త ప్రసరణ మెదడు దాకా చేరి కోలుకునే అవకాశం ఉందన్నారు. ఈ విధానం ద్వారా చాలా మంది బతికి బయట పడ్డారన్నారు. సీపీఆర్ చేసే విధానాన్ని విద్యార్థులకు చూపి అవగాహన కల్పించారు. కరస్పాండెంట్ ఎం.పి. వెంకట్రావు, ప్రిన్సిపాల్ ఫణి పార్థసారధి, తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల వాసికి బంగారు పతకాలు



బాపట్లటౌన్: ఏపీ స్టేట్ మాస్టర్ అథ్లెటిక్స్‌లో బాపట్లకు చెందిన లేళ్ల వెంకటరామారావు మూడు బంగారు పతకాలను సాధించారు. ఈనెల 14, 15 తేదీల్లో గుడివాడలో జరిగిన మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో పట్టణంలోని భీమావారిపాలెంకు చెందిన లేళ్ల వెంకట రామారావు 85 సంవత్సరాలు పైబడిన విభాగంలో షాట్ పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో పోటీల్లో పాల్గొని మూడింటిలో బంగారు పతకాలు సాధించారు. ఎనిమిది పదుల వయస్సులో కూడా అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన రామారావు ఫిబ్రవరి 5,6,7 తేదీల్లో రాజస్థాన్‌లో జరిగే నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున పాల్గొంటున్నారు. ఈయన ఇప్పటివరకు 92 మెడల్స్ సాధించారు. బంగారు పతకాలు సాధించిన రామారావును సోమవారం రాత్రి పట్టణానికి పలువురు అభినందించారు.

అగ్ని బాధితులకు ఆర్థికసాయం

బాపట్లటౌన్: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు అఖండ ఫౌండేషన్ అండగా నిలిచింది. బాపట్ల ఉప్పరపాలెం ఆరో వార్డులో ఈ నెల 6న విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంటిలోని సామగ్రి, పదవ తరగతి చదువుతున్న కుమారుడి సర్టిఫికెట్లు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ సోమవారం బాధితులకు రూ. 10 వేల నగదు సాయం చేశారు. వీరితో పాటు బాపట్ల విద్యుత్ ఏఈ సాయి శ్రీనివాసరావు రూ.4 వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అఖండ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు జీవీఎల్ మోహన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వంగపాటి శివ, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ఆభరణాలు చోరీ

తెనాలిరూరల్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుల బ్యాగులో ఉన్న బంగారు ఆభరణాలు చోరీకి గురవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ గంగానమ్మపేటకు చెందిన చీదెళ్ల వెంకటసాంబశివరావు తన భార్యతో కలసి 14వ తేదీన గుంటూరులో ఓ వివాహానికి వెళ్లారు. తిరిగి 15వ తేదీ మధ్యాహ్నం ఆర్టీసీ బస్సులో తెనాలి బయలుదేరారు. ఇంటికి వెళ్లి చూడగా బ్యాగులో ఉంచిన ఆభరణాలు కనబడలేదు. చివరకు టూ టౌన్ పోలీసులను సోమవారం ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొల్లూరులో ట్రాఫికర్!

- ఇటుక పరిశ్రమకు కేరాఫ్ కొల్లూరు
- బొగ్గు, ఊక, ఇటుకరాయి తరలింపు లారీలతో నిత్యం ట్రాఫిక్ రద్దీ
- వాహనాలు బారులు తీరుతున్నా పట్టించుకోని పోలీసులు



కొల్లూరు బస్టాండ్ సెంటర్లో రద్దీ కారణంగా నిలిచిన వాహనాలు

కొల్లూరు: మండల కేంద్రమైన కొల్లూరును ట్రాఫిక్ సమస్య పట్టి పీడిస్తుంది. ఏళ్ల తరబడి ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం విఫలమవ్వడంతో సమస్య తీవ్రత రోజురోజుకు పెరుగుతుంది. నిత్యం కొల్లూరు మీదుగా వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు జరుగుతుండటంతో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతుంది. ట్రాఫిక్ క్రమబద్ధీకరించాల్సిన పోలీసులు ట్రాఫిక్ విధులు తమవి కాదన్న తరహాలో వ్యవహరిస్తుండటం సమస్యకు మూలకారణంగా ఉంటోంది. ఈమార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులతో పాటు, స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల కాలంలో భారీ వాహనాల రాకపోకలు అధిక మయిన నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమయ్యింది.

నిబంధనలకు నీళ్లు..

వాహనదారులు నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తుండటం సమస్యకు ప్రధాన కారణంగా కనిపిస్తుంది. కొల్లూరులో రేపల్లె–తెనాలి ప్రధాన మార్గమైన కొల్లూరు బస్టాండ్ సెంటర్, లాక్ సెంటర్ ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటోంది. ఇసుక రవాణా, ఇటుకరాయి పరిశ్రమ కారణంగా ఇటుక రాయి తరలింపు, ఇటుక తయారీకి అవసరమైన బొగ్గు, ఊక వంటి ఉత్పత్తుల తరలింపునకు కొల్లూరుకు నిత్యం వందల సంఖ్యలో లారీలలో దిగుమతులు, ఎగుమతులు జరుగుతాయి. ఈ లారీలకు తోడు కృష్ణా జిల్లా నుంచి, రేపల్లె ప్రాంతాలనుంచి వస్తున్న వాహనాలతో ట్రాఫిక్ అధికమవుతోంది. కొల్లూరు బస్టాండ్ సెంటర్ నుంచి గొడపాలెం మలుపువరకు రహదారి ఇరుకుగా ఉండటంతో రాకపోకలు సజావుగా సాగకుండా వాహనాలు నిలిచిపోయి బారులు తీరుతున్నాయి. ఎదురుగా వస్తున్న వాహనాలను గమనించిన వాహనదారులు తమ వాహనాలను పక్కకు నిలుపుకొనే అవకాశం ఉన్నా నిలపకుండా ముందుకు వెళ్లడంతో వాహనాలు క్రాస్ అవడానికి సమస్య తలెత్తి ట్రాఫిక్ నిలిచిపోతుంది. దీనికి తోడు దుకాణాల ముందు, రహదారుల వెంబడి వాహనాలను ఇష్టానుసారం నిలిపి వెళ్లిపోతుండటంతో ఎక్కడ ట్రాఫిక్ అక్కడ నిలిచిపోతుంది.

ప్రమాదకరంగా విద్యార్థుల రాకపోకలు..

లాక్ సెంటర్ ప్రాంతంలో వాహనాల కారణంగా విద్యార్థులు ప్రమాదకర పరిస్థితుల్లో పాఠశాలలకు రాకపోకలు సాగించాల్సి వస్తుంది. కొల్లూరు ప్రాంతానికి చెందిన అధిక సంఖ్యలో లారీలు రోడ్లకు ఇరువైపులా రెండు వరుసల్లో నిలిపి ఉంచడంతో ప్రయాణం కష్టతరంగా మారుతుంది. రోడ్డు మినహా మార్జిన్ లేకుండా నిలుపుతున్న వాహనాల కారణంగా విద్యార్థులతో పాటు, వాహనాలు వచ్చిపోయే సమయంలో పక్కకు తప్పుకునే వెసులుబాటు సైతం ఉండకపోవడంతో ఏసమయంలో ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోన్న ఆందోళన వ్యక్తమవుతుంది.

పోలీసు సిబ్బందిని కేటాయించాలి



ట్రాఫిక్ సమస్యతో నిత్యం ఏర్పడుతున్న ఇబ్బందులను తొలగించడానికి పోలీసు సిబ్బందిని ఉదయం, సాయంత్రం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నించాలి. రోడ్లపై నిలుపుతున్న వాహనాల విషయంలో కఠినంగా వ్యవహరించడంతోపాటు, వాహనాలు నిలవకుండా క్రమబద్ధంగా నడిచేలా పోలీసులు చర్యలు చేపట్టాలి.

– తోడేటి సురేష్, ప్రజాసంఘాల నాయకుడు, కొల్లూరు

కాలు కదిపే అవకాశం ఉండటంలేదు



నిత్యం వాహనాలు బారులు తీరి నిలిచిపోతున్న కారణంగా కాలు కదిపే అవకాశం సైతం ఉండటంలేదు. ముఖ్యంగా బస్టాండ్ సెంటర్, లాక్ సెంటర్లో విపరీతంగా ట్రాఫిక్ నిలిచిపోతుంది. ఈమార్గంలో వాహనాల రాకపోకలు అధికమవుతుండటంతో ఏర్పడుతున్న సమస్యను పరిష్కరించడానికి తగిన ప్రయత్నాలు చేయాలి. లాక్ సెంటర్ ప్రాంతానికి వెళ్లే లారీలను బైపాస్ రోడ్డు వైపు మళ్లించడం ద్వారా సమస్య కొంతవరకు తగ్గుతుంది.

– తోటకూర గోపాలరావు, కొల్లూరు

ద్విచక్ర వాహనం అపహరణ

చెరుకుపల్లి: ద్విచక్రవాహనం రోడ్డు పక్కన పెట్టి వాకింగ్‌కు వెళ్లివచ్చే లోగా ఆ వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన సోమవారం ఉదయం చోటు చేసుకుంది. బాధితుడు వివరాల మేరకు గుళ్ళపల్లి గ్రామానికి చెందిన చుక్క గోపి అనే యువకుడు రోజులాగానే సోమవారం ఉదయం కూడా 5గంటలకు మార్నింగ్ వాకింగ్‌కు వెళుతూ జాతీయ రహదారి పక్కనే నగరం వెళ్లే రోడ్డు పక్కన తన పల్సర్ వాహనాన్ని హ్యాండిల్ లాక్ వేసి వెళ్ళాడు. మరో 45నిమిషాల తరువాత వచ్చి చూస్తే వాహనం కనబడకపోవటంతో తన స్నేహితులతో కలసి చుట్టు పక్కల గ్రామాల్లో వెతికారు. అయినా ఆచూకీ దొరక్కపోవటంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో గోపి ఫిర్యాదు చేశాడు.

బస్సు కిందకు దూసుకెళ్లిన బైకు

- తప్పిన పెనుప్రమాదం
- స్వల్పగాయాలతో బయటపడ్డ వ్యక్తి

వెల్లటూరు(భట్టిప్రోలు): ప్రమాదవశాత్తూ ద్విచక్రవాహనదారుడు ఆర్టీసీ హైర్ బస్సును ఢీకొనడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే సోమవారం మధ్యాహ్నం కొల్లూరు మండలం చినపులివర్రుకు చెందిన వట్టికూటి సత్యనారాయణ వెల్లటూరు వైపు నుంచి వస్తున్నాడు. రేపల్లె నుంచి విజయవాడ వెళుతున్న ఆర్టీసీ బస్సు వెల్లటూరు పెట్రోల్ బంక్ వద్దకు వచ్చేసరికి మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఆర్టీసీ బస్సు కిందకు వెళ్లింది. వాహనదారుడు వంతెన వైపు పడటంతో స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్‌వేసి ఆపడంతో పెనుప్రమాదం తప్పింది. సమాచారం మేరకు 108 వాహనం సంఘటనా స్థలానికి వచ్చి బాధితుడిని తెనాలిలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ ఎం.శివయ్యను వివరణ కోరగా తమకు విషయం తెలిసిందని ఇంతవరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను అమలు చేయాలి

ఐసీడీజీపై శిక్షణా తరగతులు ప్రారంభం



సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను వివరిస్తున్న మాస్టర్ ట్రైనర్ సురేష్, పక్కన ప్రజా ప్రతినిధులు, అధికారులు

భట్టిప్రోలు: సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను అమలు చేస్తే గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని మాస్టర్ ట్రైనర్లు వక్కలగడ్డ సురేష్, పంచాయతీ కార్యదర్శి (రాచూరు), డాక్టర్ చావలి రామలక్ష్మి (వెల్లటూరు పీహెచ్‌సీ), జి.శ్రీమన్నారాయణ–ఏపీఎం (భట్టిప్రోలు), ఎ.చినవెంకటేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి (కోనేటిపురం)లు పేర్కొన్నారు. భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీజీ పై రెండవ బ్యాచ్‌కు సోమవారం నుంచి అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వీఆర్వోలు, అగ్రికల్చర్, వెల్ఫేర్, ఎనర్జీ, ఫిషరీస్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ సర్వేయర్లు, ఏఎన్ఎంలకు శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో సరైన ప్రణాళికలు రూపొందించుకుని అభివృద్ధికి పాటు పడాలని పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరిలు మాట్లాడుతూ అధికారులు ఉద్యోగ భావనతో కాకుండా సేవా భావంతో పని చేసి గ్రామాభివృద్ధికి పాటు పడాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో ఆరోగ్య, వైద్య సదుపాయాల కల్పనకు ఈ ప్రణాళికలో భాగస్వామ్యం కావాలని ఏఎన్ఎంలను కోరారు. ఎంపీడీఓ ఎస్. వెంకటరమణ, ఈఓపీఆర్డీ టి.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను అభివృద్ధి పథంలో నిలపాలి

కర్లపాలెం: గ్రామాలను అభివృద్ధి పథంలో నిలపాలని ఎంపీడీఓ అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అంశంపై గ్రామస్థాయి అధికారులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయ సహకారాలతో పేదరిక రహిత, జీవనోపాధులు, మౌలిక వసతులు కలిగిన గ్రామాలుగా తీర్చిదిద్దాలని చెప్పారు. గ్రామంలో అందరికీ తాగునీటి వసతి కల్పించటం, సామాజిక న్యాయం అందేవిధంగా చేయటంతో పాటు మహిళా స్నేహపూర్వక గ్రామాలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఏపీఎం శ్రీనివాసులురెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మంజూర్‌బాషా, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ, ఫిషరీస్, ఎనర్జీ అసిస్టెంట్లతో పాటు మహిళా పోలీసులు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

చెరుకుపల్లిలో...

చెరుకుపల్లి: మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో గ్రామంలోని ప్రతి సమస్యను గ్రామ, మండల స్థాయి అధికారులు సమష్టిగా పరిష్కరించాలని ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభాని అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యలయంలో సోమవారం గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై మండలంలోని 16,17 తేదీలలో ఒక బ్యాచ్ కార్యదర్శులు, వీఆర్వోలు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలకు నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమంను ఎంపీడీఓ సుభాని ప్రారంభించి మాట్లాడారు. రెండవ బ్యాచ్ 18,19 తేదీలలో మండలంలోని సర్పంచ్‌లు, వెల్ఫేర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మండల స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కేజీఏ శ్రీనివాసన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోపాలకృష్ణ, కనగాల పీహెచ్‌సీ డాక్టర్ జీవనలత, స్థానిక పంచాయతీ కార్యదర్శి విజయ్ బాబు, గ్రామ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం

స్వామివార్లకు ప్రత్యేక పూజలు



వేమవరంలో కొలువైన శ్రీ రుక్మాభాయి సమేత శ్రీ పాండురంగ స్వామి



పెదపులివర్రులో కొలువైన భూనీలా సమేత వరద రాజస్వామి

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరం గ్రామంలో కొలువైన శ్రీ రుక్మాభాయి సమేత శ్రీ పాండురంగ స్వామివారి దేవాలయంలో సోమవారం నుంచి ధనుర్మాస దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రతి నిత్యం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రసాద వితరణ చేయనున్నట్లు అర్చకులు ధారా నారాయణ మూర్తి తెలిపారు. ఉదయం 4:45 గంటలకు తిరుప్పావై పాశుర సహిత అష్టోత్తర శతనామ పూజ, భోగ నివేదన జరుగుతాయని పేర్కొన్నారు. జనవరి 10న వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనం నిర్వహించనున్నట్లు వివరించారు. శ్రీ మహాలక్ష్మి, శ్రీ సరస్వతీ స్వరూపిణి ఐన శ్రీ రుక్మాభాయి సమేత పాండురంగ స్వామి వార్లను భక్తులు అధికసంఖ్యలో దర్శించుకుని తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు.

పెదపులివర్రులో...

మండలంలోని శ్రీ భూనీళా సమేత వరద రాజ స్వామి దేవాలయంలో సోమవారం ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాస ప్రారంభం మొదటి రోజు ప్రాతఃకాలంలో స్వామి వార్లకు కర్పూర హారతి కావించారు.

నేటి నుంచి ఐలవరంలో...

మండలంలోని ఐలవరంలో కొలువైన వేణుగోపాలస్వామి దేవస్థానంలో మంగళవారం నుంచి ధనుర్మాస ప్రభాత సేవా కార్యక్రమాలు జరుగుతాయని అర్చకుడు దీవి రఘునాథ చక్రవర్తి తెలిపారు. దేవాలయ ధర్మకర్త రాచూరు జమిందార్ (బాబు) సహకారంతో ప్రతి నిత్యం ప్రభాత సేవ, పూజా కార్యక్రమాలు, ప్రసాద వితరణ జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే ప్రతి నిత్యం ఉదయం సమర సత సంఘం సభ్యులు నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించనున్నట్లు బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు తెలిపారు. ఈ నగర సంకీర్తనలో భక్తులు ఎవరైనా పాల్గొన వచ్చునని చెప్పారు.

ధనుర్మాస నగర సంకీర్తన

కొల్లూరు: ధనుర్మాస పూజా కార్యక్రమాలు మండలంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని చినపులివర్రులో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, సమరసత సేవా ఫౌండేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ధనుర్మాస ప్రారంభోత్సవాన్ని పునస్కరించుకొని గ్రామంలో మేలుకొలుపు నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.



గుర్రపు డెక్కతో నిండిఉన్న నల్లమడ డ్రెయిన్



తూడికాడ, గుర్రపుడెక్కతో నిండి ఉన్న ఈస్ట్‌స్వాంప్ డ్రెయిన్

డ్రెయిన్లు ఇలా.. పారుదల ఎలా?

అధికారుల అలసత్వం.. పాలకుల నిర్లక్ష్యం కారణంగా అన్నదాతలు ఎప్పటికప్పుడు కష్టాలు ఎదుర్కొంటున్నారు. వేసవిలో ఖరీఫ్ పనులు పూర్తి అయిన వెంటనే డ్రెయిన్లలో పేరుకుపోయిన నాచు, తూడికాడ, గుర్రపుడెక్కలను తొలగించకపోవడంతో చిన్నపాటి వర్షం పడినా డ్రెయిన్లలో నీరు పారుదల లేక పొలాలు ముంపునకు గురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయిన్లలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడికాడలను తొలగించాలని రైతులు కోరుతున్నారు. – బాపట్ల

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

ఎస్పీ తుషార్‌డూడీ



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్లటౌన్: మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రీడల్లో పతకాలు సాధించిన లిటిల్ ఏంజెల్ హైస్కూల్ విద్యార్థులను సోమవారం ఎస్పీ అభినందించారు. నవంబర్ నెలలో జరిగిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రీడా పోటీల్లో బాపట్ల లిటిల్ ఏంజెల్ హై స్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనపరిచారన్నారు. అథ్లెటిక్స్ విభాగానికి చెందిన క్రీడాపోటీలు శ్రీకాకుళంలో, ఫెన్సింగ్ పోటీలు నంద్యాలలో జరిగాయన్నారు. శ్రీకాకుళంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో 10వ తరగతి విద్యార్థి వై.సతీష్ 3000 మీటర్ల విభాగంలో, 800 మీటర్ల విభాగంలో పోటీపడి పసిడి, రజత పతకాలు సాధించి జాతీయ స్థాయి క్రీడలకు అర్హత సాధించాడు. నంద్యాలలో జరిగిన ఫెన్సింగ్ పోటీలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు బి.ఆదిత్య సాయి, ఎస్.కిరణేశ్వర రెడ్డిలు రజత, కాంస్య పతకాలు సాధించారన్నారు. విద్యార్థులు వివిధ విభాగాలలో పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో కూడా పోటీ పడాలన్నారు. క్రీడలలో పాల్గొనడం వల్ల విద్యార్థులకు మానసిక వికాసం పెంపొందుతుందని, సృజనాత్మకతతోపాటు ఐకమత్య భావన అలవారుతుందన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని అనేకమంది విద్యార్థులు క్రీడాపోటీల్లో పాల్గొనాలన్నారు. రాబోయే రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక పతకాల సాధించి తల్లిదండ్రులు, విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు గర్వపడే విధంగా సత్తాచాటాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్ రమేష్ కుమారు, పీఈటీ గోపి, విద్యార్థులు పాల్గొన్నారు.

వనరులను పొదుపుగా వాడుకోవాలి



ర్యాలీగా వెళుతున్న విద్యుత్ అధికారులు, సిబ్బంది

తెనాలిరూరల్: పొదుపుగా వాడుకోకపోతే భావితరాల వారికి వనరులు ఉండవనే దృక్పథంతో ఎప్పటిలాగానే విద్యుత్ పొదుపుపై విద్యుత్ శాఖ ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఇందన పొదుపు వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెనాలి విద్యుత్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీవీ చిరంజీవి తెలిపారు. ప్రజల్లో అవగాహన కలిగించేందుకు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో డివిజన్ కార్యాలయం నుంచి చెంచుపేటలోని ఉమేష్ చంద్ర విగ్రహం వరకు సోమవారం అవగాహన ప్రదర్శన నిర్వహించారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని తద్వారా దేశ ప్రగతికి తోడ్పడాలని డీఈఈ చిరంజీవి అన్నారు. విచ్చలవిడిగా బొగ్గుని వివిధ రంగాలకు వాడటంతో ఇప్పటికే బొగ్గు వనరులు తగ్గాయని అలాగే డ్యాంలో వాటర్ సోర్స్ లేక విద్యుత్తు ఉత్పత్తి తగ్గుతోందని గుర్తు చేశారు. ముఖ్యంగా విద్యుత్ వాడకంలో పొదుపు పాటించాలని డీఈఈ కోరారు. ఏడీఈ బి. అశోక్ కుమార్, ఏఈలు పీవీ సుధీర్, లక్ష్మీనారాయణ, ఏఏఓ లీలావతి, ఉద్యోగులు కార్మిక సిబ్బంది పాల్గొన్నారు.

లోక రక్షకుడు ఏసుక్రీస్తు

తెనాలిఅర్బన్: లోక రక్షకుడు ఏసుక్రీస్తు అని, ఆయన మానవులను పవిత్రులుగా మార్చేందుకు భూలోకానికి వచ్చారని సండే స్కూల్‌టీచర్ పిల్లి ప్రేమరాజు పేర్కొన్నారు. చినరావూరులోని ఆంధ్ర ఇవాజిలికల్ లూథరన్ చర్చిలో సోమవారం సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నపిల్లలకు బైబిల్ క్విజ్, డ్రాయింగ్, పాటల పోటీలు, కంఠత వాక్యాలు వంటి పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి క్రిస్మస్ పండుగ రోజున బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. సండేస్కూల్ టీచర్ దీనమ్మ, చిన్నారులు, వారి తల్లిదండ్రులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు ప్రారంభం

కొల్లిపర: మండలంలో వివిధ గ్రామాలల్లోని పాఠశాలలు, అంగ్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల కోసం ఆధార్ క్యాంపులు మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వి.విజయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం ఆమె మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ 17,18,19 తేదీలలో వల్లభాపురం, మున్నంగి, అత్తోట, కొల్లిపర గ్రామాల్లో జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో 19న తూములూరు హైస్కూల్‌లో, 20న వల్లభాపురం, మున్నంగి, అత్తోట, తూములూరు ఆయా గ్రామాలల్లో హైస్కూల్‌లో, 26, 27, 28తేదీలలో వల్లభాపురం గ్రామ సచివాలయంలో, మున్నంగి అంగన్‌వాడీ కేంద్రం–1లో, అత్తోట అంగన్‌వాడీ సెంటర్–1లో, చక్రాయపాలెంలో మండల ప్రాథమిక పాఠశాలలో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లోని విద్యార్థులు ఆధార్ కార్డులలో తప్పులు ఉన్నా, ఫోన్ నెంబర్ మార్చుకోవాలన్నా, కొత్తగా ఆధార్ కార్డు కావాలన్నా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదే విధంగా గ్రామంలో విద్యార్థులతోపాటు ప్రజలు కూడా ఎవరైన ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పులు చేసుకోవాలని అనుకుంటే ఈ క్యాంపులలో సరైన ధ్రువ పత్రాలు తీసుకుని చేయించుకోవచ్చని తెలిపారు.

సమస్యల పరిష్కార వేదికకు ఏడు అర్జీలు

రేపల్లె రూరల్: సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందించి పరిష్కరించుకోవాలని ఆర్డీఓ నేలపు రామలక్ష్మి తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి మాట్లాడారు. రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ రేపల్లె మున్సిపాలిటీకి చెందిన అడ్డేపల్లి సాయికుమార్, కొంతమంది స్థానికులు అర్జీని అందించారన్నారు. పెనుమూడి గ్రామానికి వెళ్లేందుకు ఉన్న వంతెన బలహీనంగా ఉందని, మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు అర్జీ అందించగా, డప్పు కళాకారులకు పెన్షన్‌లు మంజూరయ్యాయని, వీటిని విచారణ చేయించాల్సిందిగా అమర్తలూరు మండలం ప్యాపర్రు గ్రామం నుంచి గౌరిగిపూడి విద్యాసాగర్ అర్జీ అందించారన్నారు. రేపల్లెకు చెందిన దామర్ల శ్రీనివాసరావు ఏపీ డీజీపీ కార్యాలయంలో ఈ నెల 4వతేదీన అర్జీ అందించామని, దీనిపై విచారణ చేపట్టాల్సిందిగా అర్జీ చేసుకున్నారన్నారు. అదేవిధంగా ఆన్‌లైన్ చేయాలని కోరుతూ 2, ఆక్రమణల సమస్యపై 1 చొప్పున మొత్తం ఏడు అర్జీలు అందాయని, వీటిని సంబంధిత అధికారులకు పంపి పరిష్కరిస్తామన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
బాపట్ల డివిజన్
95055 07638 (బాపట్ల)
90102 23706 (వేమూరు, రేపల్లె)
Office mail : sakshigntadvt@gmail.com